సాక్షి
సూర్యాపేట
శనివారం । 22 । జూలై । 2023



నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో నాలుగు క్రస్టు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. - 8లో



సమస్యలు పరిష్కరించాలి

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి కోరారు. - 10లో

గరిష్టం/కనిష్టం
29° / 24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘పేట’లో మౌలిక వసతుల కల్పనకు రూ.30 కోట్లు

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి టీయూఎఫ్‌ఐడీసీ పథకం కింద రూ.30 కోట్లు మంజూరు చేయించారు. పట్టణంలోని 48 వార్డుల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. పదిరోజుల్లో టెండర్లు పిలిచి ఆయా పనులను ప్రారంభించనున్నామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

కోదాడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశ్



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

కోదాడ: కోదాడ డీఎస్పీగా నియమితులైన బి.ప్రకాశ్ శుక్రవారం తన కార్యాలయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ స్థాయిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అందరి సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను డివిజన్‌లోని పలువురు సీఐలు, ఎస్‌ఐలు కలిసి అభినందనలు తెలిపారు.

ఆర్డీఓగా సూర్యనారాయణ

కోదాడ: కోదాడ ఆర్డీఓగా నియమితులైన సూర్యనారాయణ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ ఆర్డీఓగా పనిచేస్తున్న కిశోర్‌కుమార్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో ఖమ్మం జిల్లా కల్లూరు ఆర్డీఓగా పనిచేస్తున్న కిశోర్‌కుమార్‌ను నియమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

మానసిక సమస్య.. వ్యాధి కాదు



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

సూర్యాపేట: తీవ్రమైన మానసిక సమస్య ఉన్నా.. అది వ్యాధి మాత్రం కాదని అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట పట్టణ పరిధిలో గల అంబేడ్కర్ నగర్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14416 టోల్ ఫ్రీ నంబర్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. రూ.ఐదు లక్షల వైద్య సహాయంతో కూడిన ఆయుష్మాన్ భారత్ కార్డులు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ఇస్తారని తెలియజేశారు. మానసిక సమస్యలు ఉన్న ప్రతిఒక్కరూ ఉచిత టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ రమ్యశ్రీ, స్టాఫ్ నర్స్‌లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న చింతారెడ్డి చంద్రకళ

సూర్యాపేట టౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓలు, సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్రాలు, వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని 5వ స్థాయీ సంఘం(మహిళా, శిశుసంక్షేమం) చైర్‌పర్సన్ చింతారెడ్డి చంద్రకళ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో 5వ స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన పోషకాహారం అందించి పిల్లల ఆరోగ్య స్థాయిని మెరుగుపరచాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్, సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● ఓటు వేద్దామిలా..

సాధారణ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జిల్లా యంత్రాంగం ఈవీఎం మిషన్లపై ఓటేయడం ఎలా..? అన్న అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలో ప్రత్యేకంగా తయారు చేసిన మొబైల్ వాహనంలో ఈవీఎం మిషన్లు పెట్టుకొని శుక్రవారం సూర్యాపేట శివారులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురికి ఓటు ఎలా వేయాలో ప్రయోగాత్మకంగా చూపించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



తయారు చేసిన ప్రత్యేక మొబైల్ వాహనం



ఈవీఎంపై ఓటు వేస్తున్న మహిళ

ఏటా వాగుల కష్టాలు!

- పలుచోట్ల ప్రమాదకరంగా లోలెవల్ బ్రిడ్జిలు
- వరద ఉధృతికి ఏటా ఏదో ఒకచోట మృత్యుఘోష
- కొన్నిచోట్ల రోజుల తరబడి రాకపోకలు బంద్
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- భయాందోళనలో గ్రామాల ప్రజలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వాగు జాజిరెడ్డిగూడెం మండలం సంగెం–తిమ్మాపురం రహదారిపై కోదూరు వద్ద ఉంది. ఇదే రోడ్డుపై సంగెం వద్ద మరో లోలెవల్ బ్రిడ్జి ఉంది. భారీ వర్షాలు వస్తే ఈ రెండు బ్రిడ్జిల వద్ద ఉధృతంగా వరద పారడంతో కోదూరు గ్రామానికి వచ్చేందుకు ఇరువైపులా రాకపోకలు బంద్ అవుతాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు దాదాపు 7, 8 రోజుల పాటు కోదూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమస్య జిల్లాలో దాదాపు 12 చోట్ల ఏటా ఉత్పన్నమవుతోంది.

సూర్యాపేట: వానలు కురిసి.. వాగులు పొంగితే రైతాంగంతోపాటు కూలీలు కూడా సంబుర పడుతుంటారు. కానీ, భారీ వర్షం పడిందంటే చాలు వాగులు దాటేందుకు ఎన్నాళ్లీ మాకీ కష్టాలు అంటూ కొన్నిప్రాంతాల రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడికి.. గుడికి.. బావి కాడికి ఇలా ఊరు పొలిమేర దాటిపోయిన వారు తిరిగి ఇంటికి చేరే దాకా బిక్కుబిక్కున గడుపుతున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దశాబ్దాలుగా ప్రతి వానాకాలం ఇదే పరిస్థితి నెలకొంటున్నా పట్టించుకున్న నాథులే లేకుండా పోతున్నారని లోలెవల్ బ్రిడ్జిలు.. వాగులు దాటే గ్రామస్తులు వాపోతున్నారు.

పట్టింపులేని అధికారులు

చివ్వెంల–ఆత్మకూర్, నూతనకల్ మండలాలే కాకుండా సూర్యాపేట–మహబూబాబాద్ జిల్లాలకు కలిపే ప్రధాన రహదారి అయిన చివ్వెంల–ముకుందాపురం రహదారిపై నశీంపేట వద్ద లోలెవల్ బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారింది. తుంగతుర్తి మండలంలోని కేశవాపురం–అన్నారం మధ్య గల బంధం వాగు ప్రాణాలను బలిగొంటుంది. ఈ వాగు దాటుతూ గత రెండేళ్లలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది ప్రమాదం జరగక ముందే నిధులను మంజూరు చేసింది. ఇదే విషయాన్ని గతేడాది ఆగస్టు 17వ తేదీన సాక్షి దినపత్రిక ‘వాగులు దాటేదెట్లా’ శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన మంత్రి జగదీశ్‌రెడ్డి ఆత్మకూర్‌లో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా.. ప్రస్తుతం పిల్లర్ల దశలో నిర్మాణం సాగుతోంది. ఇక బంధం వాగుపై కూడా ఇదే స్థాయిలో పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ రెండుచోట్ల మినహా ఇతర ప్రమాదకర లోలెవల్ బ్రిడ్జిల వద్ద ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి రక్షణ చర్యలు గానీ బ్రిడ్జిల నిర్మాణం గానీ చేపట్టలేదు. నాలుగు రోజులుగా జిల్లాలో ముసురు పెట్టడం, మరో రెండు, మూడురోజుల పాటు రాష్ట్రానికి భారీ వర్ష సూచన నేపథ్యంలో ఈ లోలెవల్ బ్రిడ్జిలను దాటే ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వాగు కష్టాలు తప్పవేమోనని భయపడుతున్నారు.

రెండు నియోజకవర్గాల పరిధిలోనే..

జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలోనే అత్యధికంగా ఉన్న వాగులు దాటేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దశాబ్దాల క్రితం అప్పటి అవసరాల మేరకు లోలెవల్ బ్రిడ్జిలు నిర్మించి వదిలేశారు. తర్వాత వాటి ఎత్తు పెంచకపోవడం, ప్రమాదాలు జరుగుతున్నా కొత్త బ్రిడ్జిలు నిర్మించకపోవడంతో వానాకాలం ప్రజల కష్టాలు తీరడం లేదు. జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, నూతనకల్, మద్దిరాల, మోతె, పెన్‌పహాడ్ మండలాలతో పాటు ఆత్మకూర్ (ఎస్), చివ్వెంల మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక తుంగతుర్తి మండలంలో వానాకాలంలో భారీ వర్షాలు కురిస్తే సంగెం–కేశవాపురం, కేశవాపురం–అన్నారం, కేశవాపురం–లోయపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగులు దాటాలంటే సాహసంతో కూడుకున్నదే.

ట్రాక్టర్ల సాయంతో తరలిస్తుంటాం



కోదూరు వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలి. వానాకాలం వచ్చిందంటే వరద ఉధృతితో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి ఎత్తుగా లేకపోవడంతో సమస్యగా మారింది. ఏటా వర్షాకాలంలో ఈ వాగు పారితే పంచాయతీ ట్రాక్టర్ల సాయంతో ప్రజలను వాగు దాటిస్తుంటాం. బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుంది.

– గుయ్యని బాబు, సర్పంచ్, కోదూరు, జాజిరెడ్డిగూడెం మండలం

గడువులోగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

- కలెక్టర్ వెంకట్రావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో సీఎంఆర్ లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ఎఫ్‌సీఐకి అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. శుక్రవారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు, ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్ అధికారులతో సీఎంఆర్ సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తకు కేటాయించిన సీఎంఆర్ డెలివరీ చేసేందుకు సరిపడా గోదాములు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని మిల్లర్లు.. కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వర్షాలు, హమలీల కొరత, రైల్వే వేగన్స్ సకాలంలో రాకపోవడంతో సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలోగా అందించలేకపోతున్నామని తెలిపారు. 2022 యాసంగి, 2023 వానాకాలం సీజన్ల సీఎంఆర్ సేకరణకు 4లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు కావాల్సి ఉందని, ముందుగా 77 వేల మెట్రిక్ టన్నుల నిల్వలకు సరిపోను స్థలాన్ని, మిగిలిన బియ్యం నిల్వలకు త్వరలో గోదాములు కేటాయిస్తామని ఎఫ్‌సీఐ అధికారులు.. కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ డెలివరీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బియ్యం నిల్వలకు సరిపోను గోదాములను కేటాయించాల్సిన బాధ్యత ఎఫ్‌సీఐపై ఉన్నందున తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్రతి సీజన్‌లో ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని మిల్లర్లు చేరుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్ వరుణ్‌సూద్, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఏ.వెంకట్‌రెడ్డి హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, పుల్లయ్య, రైస్ మిల్లర్ యజమానులు, ఎఫ్‌సీఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్

సూర్యాపేట రూరల్: మండల పరిధిలోని కాసరబాద క్రాస్ రోడ్డులో గల శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీని కలెక్టర్ వెంకట్రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఎంఆర్ అప్పగించడంతో నిర్లక్ష్యం చేసినందుకు మిల్లు యాజమాని వెంపటి లక్ష్మయ్యకు నోటీసులు జారీ చేయాల్సిందిగా సివిల్ సప్లయ్ డీఎం రాంపతికి కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సీఎంఆర్ పెట్టని రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవడానికి వేనకాడేది లేదని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని సీఎంఆర్ కేటాయించిన రైస్ మిల్లులందరూ సెప్టెంబర్ నాటికి తమ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్

సూర్యాపేట: జిల్లాలో వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రబలనున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ ఆదేశాల మేరకు కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, పల్లె దవాఖాన డాక్టర్లు, ఏఎన్‌ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ వర్షాల కారణంగా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు సెల్ : 9908595187 నంబర్‌ను సంప్రదించాలన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 040 24651119 కూడా సంప్రదించవచ్చని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఉండరాదని సూచించారు. వాహనాలు నడిపేవారు రోడ్లపై బురద ఉన్నట్లయితే తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. డెలివరీ డేట్ దగ్గరలో ఉన్న గర్భిణులు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నట్లయితే ఆస్పత్రులు చేరాలన్నారు. పాములు, తేళ్లు బయటికి వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తంగా ఉండాలన్నారు. అన్ని పల్లె దవఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, గ్లూకోస్, పాము కాటు విరుగుడు వ్యాక్సిన్, తేలుకాటుకి చికిత్స, మందులు తగినన్ని అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రతి పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీస్

భానుపురి (సూర్యాపేట): తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లాలనుకునే భక్తుల సౌకర్యార్థం ప్రతి పౌర్ణమికి సూర్యాపేట డిపో నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు టీఎస్ ఆర్టీసీ సూర్యాపేట డీఎం డి.సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 31న సోమవారం ఉదయం 7 గంటలకు సూర్యాపేట కొత్త బస్టాండ్ నుంచి సూపర్ లగ్జరీ బస్ బయలుదేరుతుందని పేర్కొన్నారు. మొదటగా కాణిపాకంలోని గణనాథుని దర్శనం అనంతరం అదేరోజు రాత్రికి 11 గంటలకు అరుణాచలానికి బస్ చేరుకుంటుందని చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున గిరి ప్రదక్షిణ, మధ్యాహ్నం తిరువన్నామలై నవ శివలింగాల దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం గోల్డెన్ టెంపుల్‌కు చేరుకొని అక్కడ దర్శనానంతరం రాత్రి 7 గంటల సమయంలో తిరుగు ప్రయాణమై మరుసటి రోజు ఆగస్టు 2న బుధవారం ఉదయం 9 గంటలకు సూర్యాపేట చేరుకోనున్నట్లు తెలిపారు. టిక్కెట్ ధర ఒక్కరికి రూ.3,500గా నిర్ణయించామని తెలిపారు. ప్రతి పౌర్ణమికి పదిరోజులు ముందుగానే భక్తులకు ఆన్‌లైన్‌లో బస్సు టికెట్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. టీఎస్‌ఆర్టీసీ అధికారిక వెబ్ సైట్ సందర్శించి ముందస్తు రిజర్వేషన్ కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు. అరుణాచలం యాత్ర బస్ బుకింగ్ కోసం ఇన్‌చార్జి ఏకాంబరం సెల్: 7382836177, అసిస్టెంట్ మేనేజరు సెల్ : 9032153066, డిపో మేనేజర్ సెల్ : 9959226306 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ఆధునిక పోలీసింగ్

- ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

సూర్యాపేట క్రైం: ఆధునిక పోలిసింగ్ నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ అధికారులతో అర్ధవార్షిక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో ఆధునిక పోలీసింగ్ నిర్వహిస్తున్నామన్నారు. గడిచిన ఆరు నెలల్లో జిల్లా పోలీస్ సిబ్బంది బాగా పనిచేశారని, పోలీస్ పని విభాగాల నిర్వహణంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలుస్తూ వస్తోందన్నారు. 2021, 2022 అర్ధవార్షికాలతో ఈ ఏడాది అర్ధవార్షి కాన్ని పోల్చినట్లయితే నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. వ్యవస్థీకృత నేరాలను పూర్తిగా అదుపు చేయగలిగామని తెలిపారు. తీవ్రమైన నేరాలు బాగా తగ్గాయన్నారు. మహిళా సంబంధిత నేరాలు, హత్యలు, ఛీటింగ్, కుల దూషణ నేరాలు, బాలలకు సంబంధించిన వేధింపులు, రోడ్డు ప్రమాదాలు, అక్రమ రవాణా కేసులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు.

సాధారణ ఎన్నికలకు సిద్ధంకావాలి

రానున్న శాసనసభ సాధారణ ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు, సిబ్బంది సిద్ధం కావాలని ఎస్పీ కోరారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయడానికి కృషి చేయాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడిన వారితో పాటు గతంలో ఎన్నిక సందర్భంగా నేరాలకు పాల్పడిన వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. డబ్బు, మద్యం, గంజాయి రవాణాపై అధికారులు నజర్ పెట్టాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డిని ఎస్పీ సన్మానించారు. సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, సీఐలు రాజశేఖర్, అశోక్‌రెడ్డి, శివశంకర్, రామలింగారెడ్డి, మురారి, రాము, రామకృష్ణారెడ్డి, రాఘవులు, రాజేష్, నాగార్జున, శ్రీనివాస్, శ్రీనివాసరావుపాల్గొన్నారు.

ఎంజీయూ పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో జరిగే డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మిర్యాల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఐఎంబీఏ, ఐపీసీ, లా, ఎంఈడీ కోర్సులకు ఈనెల 22న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. ఈనెల 24న జరగాల్సిన పరీక్ష యథావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు. అదే విధంగా ఈనెల 22, 24న జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా వేసినట్లు తెలిపారు. వాయిదా వేసిన పరీక్షలకు త్వరలో తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న పీఓడబ్ల్యూ నాయకురాళ్లు, పీడీఎస్‌యూ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ, మణిపూర్ మంటల్లో మాడిపోవటానికి కారణమైన బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం మోదీ, సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి వీరబాబు, జిల్లా నేత జీవన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు రేణుక, కోశాధికారి జయమ్మ, రమణ, పద్మ, శోభ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండానే..

యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ

- అక్రమంగా తరలుతున్న కలప
- సారం కోల్పోయేలా వ్యవసాయ భూముల్లో మట్టి తవ్వకాలు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): భావితరాలకు బాధ్యతగా అందివ్వాల్సిన వనరులను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో కొందరు వ్యక్తులు ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో ఒకే చోట పెద్ద పరిశ్రమలాగా ఇటుక బట్టీలు కొనసాగుతున్నాయి. వీటికి కావాల్సిన మట్టిని ఎర్ర నేలలతో పాటు చెరువుల నుంచి అనుమతు లేకుండానే తరలిస్తున్నారు. ఇటుక బట్టీల కోసం పొలాల నుంచి మట్టిని తవ్వి తీస్తుండడంతో సారవంతమైన భూముల్లోని పైపొరల్లో ఉన్న సూక్ష్మ పోషకాలు పోయి నిస్సారంగా తయారవుతున్నాయి. అంతే కాకుండా బట్టీల కాకకు భూమి లోపల ఉండే పోషకాలు నశిస్తున్నాయి. ప్రధానంగా వ్యవసాయ యోగ్యమైన పొలాలను రైతుల నుంచి లీజుకు తీసుకుని సూక్ష్మ పోషకాలు కలిగిన మట్టితో ఇటుకలు తయారీ చేస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. వనరులను కాపాడాల్సిన అధికారులు ఇటుక బట్టీల వ్యాపారులకు వంత పాడుతున్నారు.



ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ

నిబంధనలపై పట్టింపేదీ?

జిల్లాలో అనుమతులు తీసుకోకుండానే ప్రతి మండలంలో పదుల సంఖ్యలో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారికి సమీపంలో ఇటుక బట్టీలు నిర్వహిస్తుండటంతో వాటి నుంచి వెలువడే దుమ్ము, పొగతో వాయు కాలుష్యం పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు కనీసం 8,000 మీటర్ల దూరంలో ఇటుక బట్టీలు ఉండాలని, రెండింటి మధ్య కనీసం కిలోమీటర్ దూరం పాటించాలని పర్యావరణ శాఖ నిబంధనలు సూచిస్తున్నాయి. ఈ నిబంధనలకు విరుద్ధంగా కొంత మంది ఇటుక బట్టీలను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వాహకులు గుట్ట ప్రాంతాల్లో పంట పొలాల్లో ఇటుకలు తయారు చేసేందుకు పెద్ద ఎత్తున కలపను వినియోగిస్తున్నారు. వీరి దెబ్బకు పంట పొలాల్లో, అటవీ ప్రాంతంలో చెట్లు కనుమరుగవుతున్నాయి. అటవీ శాఖ అధికారులు ఇటుక బట్టీల నిర్వాహకులతో కుమ్మక్కై ప్రతినెలా ముడుపులు తీసుకుంటూ సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇటుక బట్టీలకు ఉచిత విద్యుత్..

ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తుంటే ఇటుక బట్టీల నిర్వాహకులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. ఇటుక బట్టీలు నిర్వహించే వారు తప్పనిసరి ట్రాన్స్‌కో అధికారుల వద్ద అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఒకరిద్దరు మినహా ప్రతిఒక్కరూ ఉచిత విద్యుత్‌ను యథేచ్ఛగా వినియోగించుకుంటున్నారు. వ్యవసాయ విద్యుత్ మాత్రమే కాకుండా రాత్రి వేళల్లో పనులు చేసుకునేందు వీలుగా ఉండేలా ప్రతి బట్టీ వందలాది విద్యుత్ బల్బులను వినియోగిస్తూ గృహ అవసరాలకు వాడాల్సిన విద్యుత్‌ను సైతం దుర్వినియోగం చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీరి వ్యాపారం మూడు బట్టీలు.. ఆరు ట్రాక్టర్లుగా కొనసాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

క్లుప్తంగా

మూసీ ప్రాజెక్టు నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి : మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం భారీగా ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు ప్రాజెక్టు నాలుగు క్రస్టు గేట్లను పైకెత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా.. శుక్రవారం సాయంత్రానికి 642.10 అడుగుల నీరు ఉంది. ఎగువ ప్రాంతాల నుండి 4,052 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ఇంకా వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు ప్రాజెక్టులో నీటి నిల్వలను తక్కువగా ఉంచాలని నిర్ణయించారు. దీంతో శుక్రవారం ప్రాజెక్టు నాలుగు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 4,962 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఘనంగా తిరునక్షత్ర వేడుకలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక సేవపై అమ్మవారిని అధిష్ఠింపజేసి ముఖ మండపంలో ఊరేగించారు. అనంతరం సేవకు ముందు ఆచార్యులు, పారాయణీకులు దివ్యప్రబంధ పారాయణం పఠించి, సేవాకాలం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆచార్యులు, వేద పండితులు, పారాయణీకులు, అధికారులు పాల్గొన్నారు.

25న యాదాద్రీశుడి హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలును ఈ నెల 25వ తేదీన లెక్కించనున్నట్లు ఈఓ గీతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండ కింద గల సత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఉదయం 7గంటలకు లెక్కింపు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

● జల సవ్వడులు



సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో అలుగుపోస్తున్న గుండ్ల సింగారం కత్వ



మూసీ ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు



జేజీనగర్: ముక్తా అనంతారం బ్రిడ్జిపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు



భువనగిరి మండలంలోని వడపర్తికత్వ వద్ద అలుగుపోస్తున్న రాచకాల్వ



భువనగిరి ఖిలాపై నుంచి జలపాతంలా జాలువారుతున్న వర్షపు నీరు



తిరుమలగిరి: అనంతారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు



భూదాన్‌పోచంపల్లి: జూలూరు-రుద్రవెల్లి గ్రామాల మధ్యన ప్రవహిస్తున్న మూసీ

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

మోత్కూరు: కురుస్తున్న భారీ వర్షాలతో యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం పాడిచేడు, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామాల మధ్య గల మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మోత్కూరు బిక్కేరు వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

మెడికల్ కాలేజీకి యాదాద్రీశుడి పేరు!

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్టకు మంజూరైన మెడికల్ కళాశాలను యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్ర ప్రాశస్త్యం చాటేలా ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా కళాశాలకు యాదాద్రీశుడి పేరు నామకరణం చేయనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. మెడికల్ కళాశాల ఏర్పాటుపై శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, హెల్త్ సెక్రటరీ రిజ్వి, కలెక్టర్ పమేలా సత్పతితో కళాశాల ఏర్పాటు, స్థలం ఎంపికపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి క్షేత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా పునర్నిర్మాణం చేసిందని, దేశ నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని, ఆధునిక హంగులతో మెడికల్ కళాశాల నిర్మించాలని నిర్ణయించారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం



చందాజి (ఫైల్)

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలో శుక్రవారం ప్రయాణిస్తున్న ఆటో నుంచి ఓ వ్యక్తి జారిపడి మృతి చెందాడు. పెద్దమునిగల్ గ్రామానికి చెందిన జమాల్‌పురి చందాజి(72) వ్యక్తిగత పనుల నిమిత్తం సోమవారం దేవరకొండకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో గుర్రపుతండా వద్ద ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారిపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

లారీ ఢీకొట్టడంతో..

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి వద్దగల బైపాస్ రోడ్డులో ఎస్సీ కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మేళ్లచెరువుకు చెందిన చిన్నపంగు బాలరాజు (50) అనే వ్యక్తి మృతిచెందాడు. మఠంపల్లి ఎస్ఐ సీహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువుకు చెందిన బాలరాజు మిషన్‌భగీరథ పథకంలో పనిచేస్తున్నాడు. మేళ్లచెరువు నుంచి బైక్‌పై వ్యక్తిగత పనిమీద మఠంపల్లికి వస్తున్నాడు. మార్గమధ్యంలో చౌటపల్లి బైపాస్‌రోడ్డులోని ఎస్సీకాలనీ సమీపంలోకి రాగానే మఠంపల్లి నుంచి మేళ్లచెరువు వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బాలరాజు వాహనంతో సహా రోడ్డు పక్కకు పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు ఇళ్లలో చోరీ

● రూ.60వేల నగదు, 6 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



భాగ్యనగర్ కాలనీలో ఓ ఇంట్లో తెరిచిన ఉంచిన కబోర్డు డోర్స్

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో దొంగలు వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. నగదుతో పాటు బంగారు ఆభరణాలను అపహరించారు. ఈ సంఘటన పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ముల్కూరు ఉపేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లాడు. దీంతో ఇంట్లోకి దూరిన దొంగలు 6 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు తో పాటు రూ.50వేలు విలువ చేసే విదేశీ డాలర్లు చోరీ చేశారు. అదేవిధంగా నూకల భాస్కర్‌రెడ్డి ఇంట్లో చొరబడ్డారు. ఎంత వెతికినా ఏమీ దొరకకపోవడంతో పక్కనే ఉన్న గంగాధర్ ఇంట్లోకి వెళ్లారు. ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. అనంతరం పక్కనే ఉన్న సైదులు ఇంట్లోకి దూరి అక్కడా ఏం లభించకపోవడంతో వెళ్లిపోయారు. ఉదయం లేచి చూడగా చోరీ జరిగిందని గ్రహించిన సదరు బాధితులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. డీఎస్పీ పి.వెంకటగిరి, సీఐ నరసింహారావు అక్కడకు చేరుకుని ఇళ్లను పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ఫిట్స్‌తో పొలంలో పడి రైతు మృతి



గంగదేవి శంకరయ్య(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: ఫిట్స్ రావడంతో ఓ రైతు పొలంలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో చోటు చేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు గంగదేవి శంకరయ్య(40) గ్రామశివారులో ఉన్న తన వ్యవసాయ పొలంలో కూలీలతో కలిసి వరి నాట్లు వేస్తున్నాడు. సాయంత్రం పొలం గట్టు వెంట నడుచుకొంటూ వెళ్తుండగా అదే సమయంలో మూర్ఛ(ఫిట్స్) రావడంతో పొలంలో బోర్లా పడిపోయాడు. ఆ సమయంలో కూలీలంతా నాట్ల పనిలో నిమగ్నం కావడంతో శంకరయ్యను ఎవరూ గమనించలేదు. ఎంతసేపటికీ భర్త రాకపోవడంతో భార్య లావణ్య అనుమానంతో కొద్దిదూరం వెళ్లి చూడగా శంకరయ్య పొలంలోని బురదలో ఊపిరాడక మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇటీవల ఒక కుమార్తె వివాహం చేశారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవిశ్వక్సేన సన్నిధి ఎదుట అమ్మవారిని అధిష్ఠింపజేసి ఆరాధన చేపట్టి సేవను ఊరేగించారు. వర్షాలు కురుస్తుండడంతో లక్ష్మీదేవిని ఆలయ ముఖమండపంలోనూ ఊరేగించారు. ఇక ప్రధానాలంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వర్షం కారణంగా భక్తులు తక్కువ సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు బోసిపోయి కనిపించాయి.



అమ్మవారికి హారతినిస్తున్న ఆచార్యులు

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



మృతుడు రోషయ్య

మునగాల(కోదాడ): మునగాల మండలంలోని ముకుందాపురంలో శుక్రవారం ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానిక ఏఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బయ్యా రోషయ్య(70)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండవ కుమారుడు ఉప్పలయ్య తన అత్తగారి ఇంటి నుంచి తిరిగి వచ్చేసరికి తండ్రి రోషయ్య ఇంటి ఎదుట వరండాలో మంచంపై పడుకొని ఉన్నాడు. ఎంత పిలిచినా లేవకపోవడంతో అనుమానం వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడి రెండు చేతుల మీద, ఎడమ కణతపై చర్మం నల్లగా కమిలి ఉండడంతో రోషయ్య మృతిపై అనుమానం ఉందని ఉప్పలయ్య శుక్రవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ కారింగుల కృష్ణమూర్తి తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిట్యాల: చిట్యాల పట్టణంలోని సంతోష్‌నగర్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం రాత్రి పట్టుకున్నట్లు చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి శుక్రవారం తెలిపారు. సంతోష్‌నగర్‌కు చెందిన జంగిలి యాదయ్య కొంత కాలంగా రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి తన ఇంట్లో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు యాదయ్య ఇంట్లో తనిఖీ చేయగా.. నిల్వ చేసిన పది బస్తాల్లోని ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం దొరికినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని రాళ్లజనగాం గ్రామంలో కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన తెల్జీరి రమేష్ వ్యవసాయ బావి వద్ద ఉన్న మేకల షెడ్డులో గురువారం రాత్రి సమయంలో కుక్కలు దాడి చేసి నాలుగు మేకలను చంపివేసాయి. వీటి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని రమేష్ తెలిపాడు.

మద్యం మత్తులో ఇద్దరు కానిస్టేబుళ్ల హల్‌చల్

● శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి..

నేరేడుచర్ల: నేరేడుచర్లలో ఇద్దరు కానిస్టేబుళ్ల మద్యం మత్తులో హల్‌చల్ చేసిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నెల 19వ నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెంలో ఓ బెల్ట్‌షాపు నిర్వాహకుడికి, ఇద్దరు కానిస్టేబుళ్లకు గొడవ జరిగింది. అడ్డు చెప్పబోయిన మరో వ్యక్తిపై కానిస్టేబుళ్లు దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మద్యం తాగిన కానిస్టేబుళ్లు డబ్బుల విషయంలో ఘర్షణకు దిగారని, మద్యం తాగి డబ్బులు ఇవ్వకుండా గొడవ చేశారని, బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. వీరు ఇటీవల హెడ్ కానిస్టేబుల్ ట్రైనింగ్‌ను పూర్తి చేసుకున్నట్లు తెలిసింది.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడ్డ బాధితుడు

మోత్కూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామ సమీపంలోని ముత్యాలమ్మ గుడి చెరువు కట్ట కింద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన విజయ్‌రెడ్డి, నాగారం మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రులు బైక్‌లపై ఎదురెదురుగా వచ్చి పాటిమట్ల, ముత్యాలమ్మ గుడి వద్ద ఢీకొన్నారు. ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని చికిత్స కోసం మోత్కూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎం మిషన్‌పై గ్యాస్ కట్టర్‌తో కోసిన గుర్తులు

చిట్యాల: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ఉన్న ఏటీఎంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. చిట్యాల ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని హైవేలో ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ఏర్పాటు చేసిన ఏటీఎంలోకి గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. మిషన్ ఓపెన్ కాకపోవటంతో దొంగలు వారి ప్రయత్నాన్ని విరమించుకున్నారు. శుక్రవారం ఉదయం గుర్తించిన బ్యాంకు మేనేజర్ సత్తయ్య చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించేందుకుగా పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



మృతి చెందిన ధరావతు మధు



ముత్యాలు(ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటనలు సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకున్నాయి. చివ్వెంల మండల పరిధిలోని పాండ్యానాయక్ తండాకు చెందిన ధరావతు బాబు, సరుల చిన్న కుమారుడు ధరావతు మధు (22), మోదిన్‌పురం గ్రామ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలో ఉన్న తమ వ్యవసాయ పొలం వద్ద నారుమడికి నీళ్లు పెట్టేందుకు శుక్రవారం ఉదయం వెళ్లాడు. అక్కడే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరు తెగి కింద పడి ఉండగా.. గమనించని మధు దానిపై కాలు పెట్టడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన సమీపంలోని రైతులు మధును చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి బాబునాయక్ స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కొడవలికి విద్యుత్ వైరు తగిలి..

చౌటుప్పల్: చౌటుప్పల్ మండల పరిధిలోని మందోళ్లగూడెం గ్రామానికి చెందిన యాట ముత్యాలు(55) చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నివాసం ఉంటూ లింగారెడ్డిగూడెం గ్రామంలో ఓ రైతుకు చెందిన కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లి బోరుబావి వద్ద ఉన్న గడ్డిని కొడవలితో కోస్తున్నాడు. ఈ క్రమంలో గడ్డిలో ఉన్న బోరుమోటారుకు వెళ్లే విద్యుత్ వైరుకు కొడవలి తగలడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని సమీపంలోనే ఉన్న రైతు లచ్చిరెడ్డి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు ఎస్సై దిలీప్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైండోవర్ అతిక్రమణ

● రూ.లక్ష బైండోవర్ రుసుము చెల్లించాలని తహసీల్దార్ ఆదేశం



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎస్ఐ

మిర్యాలగూడ అర్బన్: బైండోవర్ చేసిన వ్యక్తి తిరిగి మరోవ్యక్తిపై దాడికి పాల్పడగా అతడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సంఘటన శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం .. ఎన్నికలు సమీపిస్తుండడంతో మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఇంజమూరి ఏడుకొండలును ఈ నెల 14న తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కాగా.. సదరు వ్యక్తి ఈ నెల 15న సాయిశంకర్ అనే వ్యక్తిపై దాడి చేయడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో అతడిని ఎస్ఐ శివతేజ్ తిరిగి రెండోసారి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఏడుకొండలుకు రూ.లక్ష బైండోవర్ రుసుము చెల్లించాలని తహసీల్దార్ అనిల్ నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లో ఈ రుసుము చెల్లించకుంటే ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.